రోడ్డున్నా బస్సులు కరువు !

- పెనుకొండ నియోజకవర్గంలో 80కి పైగా గ్రామాలకు బస్సు సౌకర్యం నిల్
- సగానికిపైగా గ్రామాలకు ఆటో ప్రయాణమే దిక్కు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రజలు


పెదిపల్లి నుంచి స్కూల్‌కు ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

రొద్దం: పెనుకొండ నియోజకవర్గంలో రహదారులున్నా దాదాపు 80కి పైగా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. నియోజకవర్గంలోని పెనుకొండ, రొద్దం, పరిగి, సోమందేపల్లి, గోరంట్ల మండలాల్లో 80 గ్రామ పంచాయతీలున్నాయి. కొన్ని గ్రామాలు పట్టణాలకు ఆనుకుని మూడు వైపులా ఉన్నాయి. మరికొన్ని కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉన్నాయి. చాలా గ్రామాలకు ఆటోలు కూడా వెళ్లడం లేదు. గుట్టలు, వాగులు, వంకలు ఉన్నా కాలినడకే శరణ్యం. అత్యవసర పరిస్థితుల్లో మండల, నియోజవర్గ కేంద్రాలకు రావాలంటే అవస్థలు పడుతున్నారు.

రొద్దంలో 30 గ్రామాలకు...

- రొద్దం మండలంలో 30 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. పావగడ–పెనుకొండ, మడకశిర–పెనుకొండ, రొద్దం–హిందూపురం, పెనుకొండ–పేరూరు తదితర ప్రధాన రహదారుల్లో ఉన్న గ్రామాలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. మిగిలిన గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నారనాగేపల్లి, బూచెర్ల, సానిపల్లి, వైటీరెడ్డిపల్లి, కనుమర, గోనిమేకులపల్లి, పెద్దిపల్లి, బొక్సంపల్లి, డి.రంగాపురం, జక్కలచెరువు తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. నారనాగేపల్లికి రూ.కోట్లు ఖర్చు పెట్టి రోడ్డు వేశారు. అయితే బస్సు సౌకర్యం కల్పించలేదు. జక్కలచెరువు, వైటీరెడ్డిపల్లి, డి.రంగాపురం, డీఆర్ కొట్టాల గ్రామాలకు ఆటో సౌకర్యం కూడా లేదు. ఆయా గ్రామాల ప్రజలు ఇప్పటికీ కాలినడకనే గమ్యస్థానానికి చేరుకోవాల్సిన పరిస్థితి.
- పరిగి మండలంలో ఊటుకూరు, నరసాపురం, కొత్తపల్లి, ముద్దిరెడ్డిపల్లి, శాసనకోట, కొత్తనరసాపురం, విట్టాలపల్లి, మోద, శ్రీరంగరాజుపల్లి, యర్రగుంట, నేతులపల్లి గ్రామాలకు రోడ్లు ఉన్నా బస్సులు తిరగడం లేదు.
- సోమందేపల్లి మండలంలో తుంగోడు, చిన్నబాబయ్యపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.
- పెనుకొండ రూరల్ దుద్దెబండ, గొల్లపల్లి, చంద్రగిరి, గొందిపల్లి, మునిమడుగు గ్రామాలకు రోడ్లు సౌకర్యం ఉన్నా బస్సులు తిరగడం లేదు.
- గోరంట్ల మండలంలో వానవోలు, గంగంపల్లి, రెడ్డిచెరువుపల్లి, పూలేరు, వెంకటరమణపల్లి, కమ్మవారిపల్లి తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధన అడ్డు ..

రోడ్లులున్నా గ్రామాలకు బస్సు తిప్పాలంటే ఆర్టీసీ సంస్థకు ఆదాయం కావాలి. బస్సు నడపాలంటే కిలోమీటరుకు రూ.18 ఆదాయం రావాలనే నిబంధన ఉందని దాంతో తాము ఏమీ చేయలేకపోతున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులు అవస్థలు పడుతున్నారు



బస్సు సౌకర్యం వివిధ గ్రామాల విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, పాల వ్యాన్లలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అసలు బాలికలను పాఠశాలలకు, కళాశాలలకు సైతం పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవతో బస్సులు నడిచేలా చూడాలి.

– నాగార్జున, సర్పంచ్, నారనాగేపల్లి, రొద్దం మండలం

బస్సు సర్వీసులు నడపాలి



పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకెళ్లాలంటే తలకు మించిన భారమవుతోంది. మండల కేంద్రాల నుంచి బాడుగ ఆటోలను అధిక ధరలతో మాట్లాడుకుని తీసుకెళ్లాల్సి వస్తోంది. రైతులు వాణిజ్య పంటలకు స్వస్తి పలికారు. బస్సులు గ్రామీణ ప్రాంతాలకు వస్తే పంట ఉత్పత్తిల తరలింపు సులభతరం అవుతుంది. ఆర్టీసీ అధికారులు గ్రామీణ ప్రజల కష్టాలను గుర్తించి సర్వీసులు నడపాలి.

– వెంకటేష్ పెద్దిపల్లి రొద్దం

క్లుప్తంగా

రికార్డులు సక్రమంగా నిర్వహించండి


మాట్లాడుతున్న సీడీపీఓ పద్మ

అమరాపురం: మండలలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్, పోషణ అభియాన్ తదితర వాటిని క్రమం తప్పకుండా నమోదు చేయాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందిస్తున్న సేవలు సక్రమంగా ఫేస్ యాప్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ, కో ఆర్డినేటర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు


పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న బాలికలు

అగళి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన నవ్య, దీక్ష, భువన, దాక్షాయని, యమునలకు అవార్డులు అందజేశారు. హెచ్‌ఎంలు యంజారప్ప, వరదరాజు, ఏటీఎల్ ఓబుళేసు, తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి పరామర్శ

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీ నగర్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మారుతీరెడ్డి తండ్రి అశ్వర్థరెడ్డి (80) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అశ్వర్థరెడ్డి మృతదేహం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు బి.నారాయణరెడ్డి, రాజారెడ్డి, డి.శ్రీనివాసులు, మారుతీరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం


పీర్లను జలధికి తీసుకెళ్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లిలో మొహర్రం వేడుకలు ముగిశాయి. మంగళవారం తెల్లవారజామున అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో పీర్ల స్వాములకు భక్తులు చెక్కర చదింపులు చేయించారు. అనంతరం పీర్లను ఊరేగింపుగా జలధికి తరలించారు.


అగ్నిగుండ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

విద్యా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రవిచంద్ర

గుడిబండ: ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు బెంగళూరుకు చెందిన గాయత్రి సిల్క్స్ నిర్వాహకులు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కల్లురొప్పం, మైనాగానపల్లి, రాళ్లపల్లి, ముదిగుబ్బ, ఎస్‌ఆర్ రొప్పం పాఠశాలలో చదువుతున్న 246 మంది పేద విద్యార్థులకు రూ.45,000 విలువ చేసే నోట్ పుస్తకాలు, స్టేషనరీ, మాస్కులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు నాగరాజు, శ్రీనివాసులు, కరియప్ప, సోమశేఖర్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నిధులు రికవరీ చేయండి


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి: మండలంలో ఉపాధి హామీ పథకంలో స్వాహా చేసిన నిధులు రికవరీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న మాట్లాడుతూ ఇటీవల జరిగిన సామాజిక తనిఖీకు సంబంధించి బహిరంగ ప్రజా వేదికలో రూ.33.62లో పక్కదారి పట్టినట్లు అధికారులు ప్రకటించారని చెప్పారు. అందుకే వెంటనే పక్కదారి పట్టిన నిధులు రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్రామాల్లో పనులు చేయని కూలీలను మస్టర్లలో ఎక్కించి బిల్లులు స్వాహా చేశారని ఆయన ఆరోపించారు. అనంతరం ఏఓ మురళీకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, వెంకటేశులు, నజీర్, గోవిందప్ప, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

మెగా లెదర్ పార్కు ఏర్పాటు చేయాలి

మడకశిర: మడకశిరలో మెగా లెదర్క్ పార్కు ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం మడకశిర నియోజకవర్గ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో మెగా లెదర్ పార్కు ఏర్పాటు చేస్తామని ప్రకటన చేయాలన్నారు. మడకశిర పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఎస్సీ కార్పొరేషన్‌లో ఇది వరకే రుణాలు తీసుకుని చెల్లించలేని రుణాలు మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని, ప్రతి గ్రామంలో శ్మశాన వాటిక నిర్మాణానికి 2 ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు.

యూనిఫాం పంపిణీ

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఆ పాఠశాల హెచ్‌ఎం. రఘు యూనిఫాంలను పంపిణీ చేశారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు విద్యాశాఖ ద్వారా వచ్చిన దుస్తులను పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. ప్రతి విద్యార్థి యూనిఫాంను పాఠశాలకు వచ్చే సమయంలో తప్పక ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఏడీజే శైలజ

- నవ సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములవ్వాలి
- అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

హిందూపురం/హిందూపురం అర్బన్: నవ సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలని హిందూపురం అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ ఆఫీసులో మానవ అక్రమ రవాణాపై న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గతంలో మహిళల అక్రమ రవాణా సాగేదని, అయితే ఇప్పుడు అది మానవ అక్రమ రవాణాగా మారిందన్నారు. దేశంలో నిమిషానికి ఒక మిస్సింగ్ కేసు నమోదు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికల అక్రమ రవాణాలో అత్యధికంగా మహిళలే సూత్రధారులుగా ఉండటం శోచనీయమన్నారు. గతంలో జంతు, పక్షులపై వైద్య పరిశోధనలు జరిపి ఆ తర్వాత మానవులపై సంబంధిత మందుల ప్రభావంపై శాస్త్రవేత్తలు బేరీజు వేసేవారన్నారు. అయితే ఇప్పుడు నేరుగా మానవులపైనే పరిశోధనలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మానవ అక్రమ రవాణా అడ్డు అదుపులేకుండా పోయిందన్నారు. అపరిచితుల మాటలను నమ్మవద్దని, కుటుంబానికి రక్షణగా ఉంటూ పిల్లలు, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నవ సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములైతే మనదేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వం న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ విశ్వనాథ్, న్యాయవాదులు సుదర్శన్, గోపాలకృష్ణ, అంజనమ్మ, టౌన్ ప్రాజెక్టు మేనేజర్ హరినాథ్‌రెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది శారద మెప్మా రిసోర్స్‌పర్సన్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సమస్యలు పరిష్కరించండి

- కౌన్సిల్ మీట్‌లో ఎమ్మెల్యేను కోరిన కౌన్సిలర్లు


మున్సిపల్ కౌన్సిల్ మీట్‌లో సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్లు

మడకశిర: మడకశిర మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజును పలువురు కౌన్సిలర్లు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన కౌన్సిల్ మీట్ జరిగింది. ఎమ్మెల్యే కౌన్సిల్ మీట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కౌన్సిలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. 15వవార్డు కౌన్సిలర్ నరసింహరాజు మెప్మాలో అవినీతి జరిగిందని, ఈ అవినీతిపై విచారణ చేయాలని కోరారు. మెప్మా అధికారులతో త్వరలోనే సమావేశమై సమీక్షిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. 17వవార్డు కౌన్సిలర్ సుభద్ర మాట్లాడుతూ చాకలికుంటకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని, కుక్కల బెడదను నివారించడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. కొన్ని వార్డుల్లో తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మడకశిర మున్సిపాలిటీ సుందరీకరణకు చర్యలు చేపడతామన్నారు. మున్సిపాలిటీలోని వ్యాపారుల నుంచి అధిక సుంకం వసూలు చేస్తే సహించమన్నారు. మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఏఈ మురళి, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


గుడిబండలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ: మండలంలో పలు గ్రామాల్లో మలేరియా, డెంగీ నివారణపై మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మడకశిర మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్ షమీవుల్లా డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాలలో మురికి నీరు నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను నిర్మూలించవచ్చని మెడికల్ ఆఫీసర్ సౌందర్య పేర్కొన్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, రోలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బంగారమ్మ, సర్పంచ్ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌ల వితరణ


ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ల్యాప్‌టాప్‌లను అందించారు. మంగళవారం స్థానిక బీఈఓ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కెంచగారి సౌందర్య, జీహెచ్‌ఎస్ సాసలకుంట విద్యార్థిని డి సల్మా, జీహెచ్‌ఎస్ అరసికెరె విద్యార్థిని వి భవ్యలు ప్రతిభ కనబరచడంతో ల్యాప్‌టాప్‌లు, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీఈఓ ఇంద్రాణమ్మ, ఈసీఓ శివమూర్తినాయక్, చంద్ర శేఖర్, పీఈఓ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవాలు


పరిగి: జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్


అగళి: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప


రొళ్ల మండలం నసేపల్లిగొల్లహట్టిలో జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని నసేపల్లిగొల్లహట్టి, పిల్లిగుండ్ల గ్రామాల్లో మారెమ్మదేవికి, ఎం.రాయాపురం గ్రామాల్లో కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం వైభవంగా జ్యోతుల ఉత్సవాలను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి, పార్టీ మండల కన్వీనర్ నరసింహరెడ్డి తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో దండు మారెమ్మ అమ్మవారికి మంగళవారం జ్యోతుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక హిందూ సాదర సంఘం కుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక మహిళలతో కలిసి జ్యోతులు మోసి అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. ఈ సకాలంలో వర్షాలు కురిసి అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఉషశ్రీచరణ్ తెలిపారు.


అగళి: జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అగళి: మండల పరిధిలోని ఆలూడి, నరసబుంది, అగళి, రామనపల్లిల్లో వెలసిన కరియమ్మ, మారమ్మలకు మంగళవారం భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున జ్యోతులతో తరలివెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

న్యూట్రీషన్ గార్డెన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలన్న ఉద్దేశంతో పాఠశాల ఆవరణలో న్యూట్రీషన్ గార్డెన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం మండల పరిధిలోని అలుపనపల్లి, ఎం.రాయాపురం ప్రాథమిక పాఠశాల, బీజీ హళ్లి, హొట్టేబెట్ట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో న్యూట్రీషన్ గార్డెన్ (కూరగాలయ తోట) ఏర్పాటు చేయడం కోసం స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం మండలంలోని నాలుగు పాఠశాలల్లో మాత్రమే న్యూట్రీషన్ గార్డెన్ ఏర్పాటు చేయడం కోసం అనుమతి వచ్చిందని తెలిపారు. న్యూట్రీషన్ గార్డెన్‌లో పండిన ఆకుకూరలు, కూరగాయాలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులు స్వచ్ఛమైన వంట పదార్థాలు తయారు చేసి విద్యార్థులకు వడ్డించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల, విద్యార్థులు, ఎండీఎం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

హిందూపురం అర్బన్: హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆశావర్కర్‌కు తీవ్ర గాయాలు

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని గోరంట్ల రహదారిలో నందమూరి నగర్ వద్ద మంగళవారం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆశావర్కర్ మంజుల తీవ్రంగా గాయపడింది. మంజుల అన్న ఆంజనేయులు, తమ్ముడు సంతోష్‌తో కలసి మంజుల హిందూపురానికి ఆటోలో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మంజులను హుటాహుటిన హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్కార్పియో అపహరణ

పెనుకొండ: స్థానిక కోనాపురం రహదారిలో నివాసముంటున్న నరేష్‌కు చెందిన స్కార్పియో వాహనాన్ని సోమవారం అర్ధరాత్రి తర్వాత దుండగులు అపహరించుకెళ్లారు. ఇంటి ప్రహరీ లోపల ఉన్న షెడ్డు షట్టర్‌ను ధ్వంసం చేసి, వాహనాన్ని తీసుకుని మడకశిర మార్గం వైపు వెళ్లినట్లుగా సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకావిష్కరణ

పెనుకొండ: పట్టణంలోని వాసవీధర్మశాలలో రచయిత పచ్చి పిలుపుల సూర్యనారాయణ రచించిన 'ఉజ్జయినీ మహాకాళేశ్వరునకు గీతాభిషేకం' పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వక్తలు సాహితీ విలువల గురించి వివరించారు. కవులు కోగిర జయచంద్ర, వై. నాగరాజు, ప్రొఫెసర్ నాగరాజు, బాలసుబ్రహ్మణ్యం, సుధాకరగుప్తా, సూరి తదితరులు పాల్గొన్నారు.